క్లుప్తంగా

సత్తెనపల్లి తొమ్మిదోవార్డులో కవాతు



సత్తెనపల్లి: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎమ్.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు



రెంటచింతల: మండలంలోని సత్రశాల ఏపి జెన్‌కో టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ముందు ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బుధవారం తనిఖీలు చేపట్టినట్లు మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ అధికారి కె.పాపయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమాళిని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మే 13 నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు గ్రామాల్లో పర్యటిస్తూ చెక్‌పోస్టులను వద్ద అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేయడం జరుగుతోందన్నారు. ప్రజలు ఒక ప్రాంతం నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఎన్నికల కోడ్ ఉన్నందున వాహనాల్లో పరిమితికి (రూ.50 వేలు) మించి నగదు, అక్రమంగా మద్యం, ఎక్కువ మొత్తంలో బంగారం, వెండి, తదితర విలువైన వస్తువులు తరలింపును నియంత్రించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడ గ్రామాల్లో ఎక్కడైనా ఎన్నికల నియమ నిబంధనలకు వ్యతిరేక పనులకు పాల్పడుతున్న విషయం తెలిసిన వెంటనే సి-విజిల్ యాప్ ద్వారా తమ బృందానికి సమాచారం అందించాలని కోరారు.

ఆ.. గ్రామాల్లో పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేయండి

నరసరావుపేట: నియోజకవర్గంలోని కర్లకుంట, తుంగపాడు, పరిగటిచెర్ల, ఇక్కుర్రు, కేశనపల్లి, యల్లమంద, ఇస్సప్పాలెం గ్రామాల బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు స్వేచ్ఛగా ఓటువేసేందుకు ఆయా గ్రామాల్లో ప్రత్యేకమైన బందోబస్తు, సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయవాదులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాము కోరిన ఏర్పాట్లు లేకుంటే టీడీపీ మూకల దాడిచేసి వారిని భయభ్రాంతులకు గురిచేసి పోలింగ్ కేంద్రాలకు రానీయకుండా అడ్డుకుంటారని పేర్కొన్నారు. గతంలో జరిగిన సంఘటనలను ఉదహరిస్తూ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. లీగల్ సెల్ అధ్యక్షుడు ఆరె.శ్రీనివాసరెడ్డి మద్ది సుభాషిణి, పాల్గొన్నారు. అంతేకాకుండా ఇదే విషయాన్ని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఆంధ్రప్రదేశ్ వారికి కూడా విజ్ఞాపనలు అందజేశామని వారు తెలిపారు.

రైతు ఆత్మహత్య

బొల్లాపల్లి: అప్పుల బాధ తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలోని పేరూరుపాడు గ్రామంలో జరిగింది. బండ్లమోటు ఎస్సై డి.చెన్నకెశవులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుర్రం చిన కోటయ్య (42) ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు చెసుకుని మృతి చెందాడు. తనకున్న అర ఎకరం స్వంత పొలంతో పాటు మరో ఐదేకరాలు పొలం కౌలుకు తీసుకుని గత రెండేళ్లుగా మిరప, వరి వగైరా పంటలు సాగు చేస్తున్నాడు. గత రేండేళ్లుగా పంటలు పండల అప్పులు తీరక ఆర్థి క ఇబ్బందులతో మనస్థాపం చెంది కుటుంబసభ్యుల పొలం వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారు.

జగన్ మొనగాడు.. బాబు మోసగాడు

- సంక్షేమ అభివృద్ధికి సహకరించండి
- మంత్రి అంబటి రాంబాబు విజ్ఞప్తి



దేవరంపాడు ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల హృదయాలలో మొనగాడుగా నిలిస్తే..చంద్రబాబు నాయుడు మాయ మాటలతో ఉత్తుత్తి హామీలిచ్చి తుంగలో తొక్కిన మోసగాడుగా అపకీర్తి మూటగట్టుకున్నారని జలవనరుల శాఖమంత్రి, సత్తెనపల్లి అసెంబ్లీ వై సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు అభివర్ణించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఓటేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లే అవుతుందన్నారు. మే 13న జరిగే పోలింగ్ లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని అంబటి విజ్ఞప్తి చేశారు.

మండలం దేవరంపాడులో బుధవారం అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించగా స్థానికుల నుంచి ఆయనకు అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు ఎదురేగి హారతులు పట్టి, ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజాదరణ కలిగిన ఏకైక నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి పేదల పక్షాన నిలిచే జగనన్నకు అండగా ఉండాలని విన్నవించారు. . గ్రామంలో గత ఐదేళ్లలో రూ19.79 కోట్లను సంక్షేమాభివృద్ధికి వెచ్చించడం జరిగిందన్నారు.

రెండు ఓట్లలో ఒకటి తనకు, ఇంకోటి ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ కు ఫ్యాన్‌గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు,మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, సూరిబాబు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాస రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, దేవరంపాడు దేవస్థానం కమిటీ చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాపులను మోసం చేసింది చంద్రబాబే

- సాయం చేసిన జగనన్నకు అండగా ఉందాం
- మంచిని చూడండి.. మళ్లీ ఆశీర్వదించండి..
- 11 గ్రామాల్లో కాపు సామాజిక ఆత్మీయ సమావేశాలు



బలుసుపాడులో కాపునేత వంగవీటి నరేంద్ర, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు హారతులు పడుతున్న మహిళలు

పెదకూరపాడు: చంద్రబాబు కాపులను కాలానుగుణంగా మోసం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు వంగవీటి నరేంద్ర విమర్శించారు. బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావుతో కలిసి అమరావతి మండలం వైకుంఠపురం, అమరావతి, లింగాపురం,మల్లాది, పెదకూరపాడు మండలం బలుసుపాడు, తమ్మవరం, కాశిపాడు, క్రోసూరు మండలం బయ్యవరం, ఎర్రబాలెం, 88 త్యాళ్ళూరు, హుసానాబాద్, దోడ్లేరు గ్రామాల్లో కాపు సామాజిక వర్గీయులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా వంగవీటి నరేంద్ర మాట్లాడుతూ కాపులను మోసం చేసే చంద్రబాబు కావాలా...? సాయం చేసే జగన్‌మోహన్ రెడ్డి కావాలా ఆలోచించుకోవాలన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి ఉంటేనే కాపులు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావు చేసిన మంచిని చూసి మళ్లీ గెలిపించాలని కోరారు. కాపులకు ఏడాదికి రూ.2వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10వేల కోట్ల సాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. ఐదేళ్లలో కాపులకు డిబీటి, నాన్ డిబీటి కలిపి రూ.34,34 కోట్లను సాయంరూపంలో జగన్ ప్రభుత్వం అందించిందన్నారు.కాపు సామాజిక వర్గం అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ఎవ్వరూ చేయలేదని గుర్తు చేశారు.

ఫ్యాన్‌కే పట్టం కట్టండి

ఎమ్మెల్యే నంబూరు మాట్లాడుతూ మరో 11 రోజు ల్లో జరగబోయే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి జగన్ మోహన్ రెడ్డికి పట్టం కట్టాలని పిలుపునిచ్చా రు. అభివృద్ధి ,సంక్షేమం కొనసాగించాలంటే వై సీపీ పక్షాన కాపులు నిలవాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. ఆత్మీయ సమావేశాల నిమిత్తం ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే నంబూరు, వంగవీటి నరేంద్రలకు స్థానిక మహిళలు హారతులు పట్టారు.

అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

వాడవాడలా ప్రపంచ కార్మిక దినోత్సవం



పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జెండా ఆవిష్కరణలో నాయకులు



నకరికల్లులో ఎర్రజెండా ఎగురవేస్తున్న సీపీఎం, కార్మికసంఘాల నాయకులు



పాతలారీ ఆఫీస్ సెంటర్లో జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

సత్తెనపల్లి: దేశాభివృద్ధిలో కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఏఐటీయుసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్ అన్నారు. పట్టణంలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. పట్టణంలోని అమరావతి బస్టాప్ సెంటర్, ఎస్ఎస్ కెనాల్స్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, ఆర్టీసీ గ్యారేజ్ సమీపంలో పతాకాన్ని ఆవిష్క రించారు. శ్రమకు తగ్గ వేతనం, 8 గంటల పనిదినం ఉండాలంటూ నినదించారు. కంబాల శ్రీనివాస్ ఇరిమ్మియా, తోట రామతిరుపతి రావు, డీఆర్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్, సీపీఎం కార్యాలయం, కొత్తపేట, ఫణిదం చేనేత సొసైటీ, మున్సిపల్ కార్యాలయం వద్ద అరుణపతాకాన్ని కార్మిక నాయకులు ఆవిష్కరించారు. గార్లపాడు బస్టాండ్ సెంటర్, మున్సిపల్ కార్యాలయం , రైల్వే స్టేషన్ , అమరావతి బస్ స్టాప్ సెంటర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ , మన గ్రోమోర్ వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చలమయ్య, కట్టా శివ దుర్గారావు, అవ్వారు ప్రసాదరావు, అనుముల వీరబ్రహ్మం, పొట్టి సూర్య ప్రకాష్‌రావు, పెండ్యాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అరుణ పతాక రెపరెపలు

నకరికల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయావరణలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎర్ర జెండాను ఎగురవేశారు. రైతుసంఘం రాష్ట్ర నాయకులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ కార్మిక, కర్షకుల పోరాటానికి ఎర్రజెండా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జి.పిచ్చారావు, ఈవూరి అప్పిరెడ్డి, ఈవూరి లక్ష్మారెడ్డి, బాణావత్ కొండానాయక్, ఎప్సీబా, బత్తుల రామాంజినేయులు, పరసా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల త్యాగాలు వెలకట్టలేనివి

ముప్పాళ్ళ: కార్మిక దినోత్సవ సందర్భంగా మాదల, నార్నెపాడు గ్రామాల్లో ఏఐటీయుసీ జెండాను కార్మిక నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ, కార్మిక సంఘాల నాయకులు కందిమళ్ళ సాంబశివరావు, తొరటి అమరలింగేశ్వరరావు, పఠాన్ సైదాఖాన్, గారా జాలయ్య, నూకారపు సాంబశివరావు, మార్పుల వెంకట రెడ్డి, కూరపాటి ప్రభాకర్, కంచర్ల నాగేశ్వరరావు, ఇంజం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో మేడే వేడుకలు

అమరావతి : శ్రామిక దినోత్సవ సందర్భంగా స్థానిక పాతలారీ ఆఫీస్ సెంటరులోపార్టీ అమరావతిశాఖ కార్యదర్శి ఎస్‌డి మొహీద్దీన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అరుణపతకాన్ని కార్మిక సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్‌సెంటర్, మ్యూజియం. బృందావనం హోటల్, పొట్టి శ్రీరాములు బొమ్మ కూడళ్లలో పతాకను ఎగురవేశారు. కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి బి సూరిబాబు, టి రాములు, సి వెంకటేశ్వర్లు, కె మంత్రాలు, జె యుగంధర్, తోట అంజి, సంసాన్, శివశంకర్, తిరుపతయ్య సతీష్, సత్యనారాయణ, తుడుం కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలవికాస్ వార్షికోత్సవం

అమరావతి : స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళ్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ బాలవికాస్ వార్షికోత్సవం నిర్వహించింది. మునుగోడు, పాలడుగు జానపాడు కేంద్రాల వార్షికోత్సవంలో శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామిజీ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భవానీ ప్రసాద్, గుంటూరు జిల్లా కన్వీనర్ డాక్టర్ విజయ భాస్కర్, విద్యార్థులు, శిక్షకులు పాల్గొన్నారు.

జగన్ వస్తే.. ఇంటివద్దకే పింఛన్



సత్తెనపల్లి: వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలంటే సీఎం జగన్ మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని మంత్రి అంబటి రాంబాబు సతీమణి విజయ లక్ష్మి అన్నారు. పట్టణంలోని తొమ్మిదో సచివాలయ పరిధి 24వ వార్డులో కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్‌తో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయం పరిధిలో సంక్షేమాభివ-ద్ధిని వివరించారు. పరమేశ్వరి ఆలయం వద్ద నుంచి ప్రచారం ప్రారంభించగా మహిళలనుంచి విశేష స్పందన లభించింది. వారంతా ఎదురేగి విజయలక్ష్మికి హారతులిచ్చారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తు పై వేసి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమెవెంట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ, వృంద మమిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ గంగారపు అనూష, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

టీడీపీకి గుడ్ బై చెప్పిన 30 తమ్మవరం కుటుంబాలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వంగవీటి నరేంద్ర సమక్షంలో వైఎస్సార్ సీపీ గూటికి



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వంగవీటి నరేంద్ర సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన తమ్మవరం నాయకులు



నంబూరు కల్యాణ్‌చక్రవర్తి సమక్షంలో చేరిన బయ్యవరం టీడీపీ కార్యకర్తలు

పెదకూరపాడు: తమ్మవరంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాల ప్రతినిధులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు వంగవీటి నరేంద్ర, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీ గూటికి చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. మంచిచేసే పార్టీలోకి రావడం సంతోషంగా ఉందని వారన్నారు. 30కుటుంబాల్లో 20 కుటుంబాలు టీడీపీనుంచి రాగా, 10 కుటుంబాలు ఇటీవలే వైఎస్సార్ సీపీనుంచి టీడీపీకి వెళ్లి తిరిగి పార్టీలోకి చేరాయి.

తప్పు తెలుసుకున్నాం

మాయ మాటలు నమ్మి టీడీపీలో చేరామని తప్పు తెలుసుకొని మళ్లీ సొంతగూటికి వచ్చామని తమ్మవరానికి చెందిన 10 కుటుంబాల ప్రతినిధులు అన్నారు. టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారని వారన్నారు. .

వైఎస్సార్ సీపీలో బయ్యవరం టీడీపీ కార్యకర్తలు

క్రోసూరు: బయ్యవరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు కల్యాణ్ చక్రవర్తి సమక్షంలో చేరారు. అమరావతి లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వీరంతా పార్టీ బాటపట్టారు. చేరినవారిలో ఆంజనేయులు, తలారి అంజయ్య, తలారిబాబు,రౌతు రమేష్,సిద్ధి గోపి, బుర్రశ్రీనివాసరావు,బుర్రు చలమయ్య, తదితరులున్నారు. వీరందరికీ కండువాలు కప్పి కళ్యాణ్ చక్రవర్తి పార్టీలోకి ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

అమరావతి : దిడుగు గ్రామానికి చెందిన పది కుటుంబాల టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ రాష్ట్ర నాయకులు వంగవీటి నరేంద్ర సమక్షంలో వీరంతా పార్టీ బాట పట్టారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేయాలని నంబూరు వారికి సూచించారు.

సత్తెనపల్లిలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



పట్టణంలోని 30వ వార్డులో ఎన్నికల ప్రచారంలో నాయకులు



పట్టణంలోని 2వ వార్డులో ఎన్నికల ప్రచారంలో నాయకులు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి కావాలని కాంక్షిస్తూ పట్టణంలోని వివిధ వార్డుల్లో పార్టీ నాయకులు బుధవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 2,,16, 30 వార్డుల్లో పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారంలో పాల్గొన్నాయి. ఎబ్బిలి రవికుమార్, జడ ప్రసాద్ ఆధ్వర్యంలో రెండోవార్డు, నందిగామ ఆదాం ఆధ్వర్యంలో 16, ఉల్లంఘుల జయలక్ష్మి , ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో 30 వ వార్డులో నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి అంబటి రాంబాబును గెలిపించాలంటూ ప్రజలను అభ్యర్థించారు.

సీఎం జగన్‌తోనే కాపుల సాధికారత

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు వంగవీటి నరేంద్ర



మల్లాది కాపు ఆత్మీయసమావేశంలో మాట్లాడుతున్న వంగవీటి నరేంద్ర

అమరావతి : అమరావతి మండల పరిదిలోని వైకుంఠపురం, అమరావతి, లింగాపురం, మల్లాది గ్రామాలలో బుధవారం కాపుల ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశాలలో వంగవీటి నరేంద్ర మాట్లాడుతూ.. కాపులకు ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఇస్తామని 2019లో హామీఇచ్చి ఐదేళ్లలో రూ.34 వేల కోట్లు కాపుల కోసం ఖర్చు చేయడం గొప్ప విషయమన్నారు. 2014లో కాపుల సంక్షేమం కోసం ఐదువేలకోట్లు ఖర్చుచేస్తామన్న చంద్రబాబు రూ. 1,340కోట్లు మాత్రమే విదిల్చి మోసం చేశారని విమర్శించారు. పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎంతో కషి చేస్తున్నారన్నారు. ఆయన కృషి వల్లే అమరావతి – బెల్లంకొండ రోడ్డు, పెదమద్దూరు బ్రిడ్జి, క్రోసూరు పాలిటెక్నిక్ కాలేజ్ వంటివి సాధ్యమయ్యాయన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి నంబూరు శంకరరావును, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, రాష్ట్ర కాపుకార్పొరేషన్ డైరక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, మాజీ ఎంపిపి వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు కాపునాయకులు నిమ్మా విజయసాగరబాబు తదితరులతో పాటు ఆయా గ్రామాల కాపునాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న మందా కృష్ణ మాదిగ



మునగోడులో మాట్లాడుతున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎస్‌సి నాయకుడు యెడ్లూరి దాసు

అమరావతి: మాదిగలను మరోసారి మోసం చేయటానికి మందా కృష్ణ మాదిగ ప్రయత్నిస్తున్నారని నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఎస్‌సి నాయకుడు యెడ్లూరి దాసు విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని ధరణికోటలో మాదిగ సోదరులతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో మాదిగలు కురుక్షేత్ర సభ పెడితే చంద్రబాబు పోలీసులతో అణగదొక్కడానికి ప్రయత్నించిన ఘటనలు మాదిగలు మరిచిపోరన్నారు. జగన్ మోహన్ రెడ్డి మాదిగలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించి, అభివృద్ధి, సంక్షేమఫలాలను అందిస్తున్నారన్నారు. జగనన్నకు మాదిగసోదరులంతా అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు, పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నర్సారావుపేట పార్లమెంటు నియోజకవర్గంలో అనిల్ కుమార్ యాదవ్‌కు మాదిగసోదరులంతా అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కంభ ంపాటి ఇజ్రాయేలు, పాటిబండ్ల రమేష్, తేజా, శివబాబు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ట్రాక్టరు డ్రైవరు మృతి



మృతి చెందిన కరిముల్లా

శావల్యాపురం:గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో వేగంతో వస్తున్న లారీ, ట్రాక్టరును ఢీకొన్న సంఘటనలో ట్రాక్టరు డ్రైవరు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై చల్లా సురేష్ కథనం ప్రకారం.. పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా (34) గుంటూరులో సోనాలిక ట్రాక్టరు కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్త ట్రాక్టరు డెలివరీ ఇచ్చేందుకు మంగళవారం అర్ధరాత్రి గుంటూరు నుంచి కర్నూలు బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలో శావల్యాపురం సబ్‌స్టేషను వద్ద గుంటూరు నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి వెనుక నుంచి ట్రాక్టరును ఢీకొంది. ఈక్రమంలో ట్రాక్టరు బోల్తా పడటంతో డ్రైవరు కరిముల్లా రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి.108 అత్యవసర వాహనం ద్వారా క్షతగాత్రుడిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కరిముల్లా మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కరెంట్ షాక్ పెట్టి..ఆపై ఇనుసరాడ్‌తో కొట్టి హత్య



హత్యకు గురైన బాణావత్ లక్ష్మీభాయి

దాచేపల్లి: సవతి తల్లిపై కక్ష పెంచుకున్నాడు. జన్మనిచ్చిన తల్లి తండ్రి లేకపోయినా అన్నీ తానై కన్న తల్లిలా చూసింది. సవతి తల్లిపై రోజు రోజుకీ కక్ష పెంచుకున్న కుమారుడు అతి దారుణంగా హత్య చేశాడు. తొలుత కరెంట్ షాక్ పెట్టి చంపేందుకు చూశాడు. కరెంట్ షాక్ తరువాత కదలటంతో ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శంకరపురంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనలో బాణావత్ హరినాయక్ భార్య లక్ష్మీభాయి (45)ని ఆమె సవతి కుమారుడు దత్తునాయక్ దారుణంగా హత్యం చేయడం సంచలనం కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హరినాయక్ మొదటి భార్య కుమారుడు దత్తు నాయక్ ఐదేళ్ల వయసు ఉన్నపుడు తల్లి చనిపోవడంతో లక్ష్మీభాయిని హరినాయక్ వివాహం చేసుకున్నాడు. వివాహం అయిన నాటి నుంచి దత్తునాయక్ అలనా పాలనా అన్నీ లక్ష్మీభాయి చూసుకుంది. గత ఐదేళ్ల క్రితం హరినాయక్ కూడా చనిపోయాడు. దత్తునాయక్‌కు వివాహమైంది. అయితే దత్తునాయక్ భార్యతో లక్ష్మీభాయికి కుటుంబ కలహాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో లక్ష్మీభాయిని హత్య చేసేందుకు దత్తునాయక్ పక్కా ప్రణాళిక రూపొందించాడు. లక్ష్మీభాయి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కరెంట్ స్థంభం నుంచి నేరుగా ఓ కేబుల్‌కి కరెంట్ సరఫరా తీసుకున్నాడు. లక్ష్మీభాయి కాళ్లకు పెడితే షాక్ తగిలి ఉచ్చు బిగించుకునేలా చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో నిద్రిస్తున్న లక్ష్మీభాయికి కరెంట్‌షాక్ పెట్టాడు. పెద్దగా కేకలు వేయడంతో కరెంట్ షాక్ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. దీంతో అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న ఇనుపరాడ్‌తో లక్ష్మీభాయి తలపై మోది దారుణంగా హత్య చేశాడు. రక్త స్రావంతో లక్ష్మీభాయి అక్కడికక్కడే మృతిచెందింది. నిందితుడు దత్తునాయక్ నేరుగా పోలీస్‌స్టేషన్‌కి వచ్చి లొంగిపోయి జరిగిన ఘటన గురించి పోలీసులకు చెప్పి నేరం అంగీకరించాడు. సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్ఐ దాసరి శివనాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని లక్ష్మీభాయి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు చెప్పారు.